సాక్షి వనపర్తి

శనివారం । 20 । జనవరి । 2024



భక్తజన సందోహం

బ్రహ్మోత్సవాల సందర్భంగా నల్లమలలోని ఉమామహేశ్వర ఆలయం భక్తులతో కిక్కిరిసింది.

వివరాలు 8లో ▸



ఆర్టీసీకి కలిసొచ్చింది

సంక్రాంతికి అదనపు బస్సులు నడపడంతో ఆర్టీసీకి భారీగా ఆదాయం సమకూరింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.7 /17.5

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత కాస్త పెరుగుతుంది. రాత్రి, ఉదయం చలిగా ఉంటుంది.

వక్ఫ్ భూముల ఆక్రమణ

బహిరంగ మార్కెట్‌లో రూ.కోట్ల విలువ



అమరచింత పెద్దచెరువు సమీపంలో వక్ఫ్ భూమిలో అక్రమంగా సాగుచేసిన పత్తి పంట

- కబ్జాదారుల చేతిలో పంటల సాగు
- నేటికీ పార్ట్–బిలోనే..
- న్యాయం చేయాలంటున్న ఇనాందారులు

అమరచింత: సమగ్ర భూసర్వేలో వెలుగుచూసిన వక్ఫ్ భూముల సమస్యను ప్రభుత్వం నేటికీ పరిష్కరించకపోవడంతో రూ.కోట్ల విలువైన ఆస్తులు కబ్జాదారుల చేతిలో చిక్కుకుపోయాయి. జిల్లావ్యాప్తంగా వక్ఫ్ భూములు అత్యధికంగా అమరచింత మండలంలోనే ఉన్నాయి. ఈ మండలంలోని మస్తీపురం, ధర్మాపురం, నందిమళ్ల, సింగంపేట, చంద్రగఢ్, అమరచింత, రంగాపురం పరిధిలో సుమారు 72 ఎకరాల భూములు మసీదులు, పీర్లచావిడీలు, రాజవళి దర్గా, ఖాజీల పేరున ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు వాటిని సంరక్షించే ప్రయత్నాలు చేపట్టడం లేదు. దీంతో పంటలు సాగు చేసుకుంటున్న కబ్జాదారులు తమనే నిజమైన వారసులుగా గుర్తించాలని, పట్టాలు ఇవ్వాలని గతంలో అధికారులకు అర్జీలు చేసుకున్నారు. వక్ఫ్‌బోర్డు ఆదేశానుసారం సర్వేనంబర్ల వారీగా రెవెన్యూ అధికారులు సర్వే చేశారే తప్పా నేటికీ హద్దులు ఏర్పాటు చేయడం లేదు. వక్ఫ్ భూముల సమస్య పార్ట్–బిలో ఉందని.. కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని మసీదు, దర్గాల నిర్వాహకులకు ఉచిత సలహాలిస్తూ చేతులు దులుపుకొంటున్నారు. 2003, జూలై 31న ఉమ్మడి రాష్ట్రంలో ఈ భూములకు సంబంధించిన గెజిట్ జారీ చేశారు. రోజురోజుకు వ్యవసాయ భూములకు డిమాండ్ పెరగడంతో కొందరు సాగు పేరుతో ఆక్రమించగా.. మరికొందరు ఏకంగా నిర్మాణాలు చేపట్టారు. దర్గా, మసీద్‌ల నిర్వాహకులు గతంలో తమకు విక్రయించారంటూ కబ్జాలో ఉంటున్నారు. భూములను సంరక్షించాల్సిన వక్ఫ్ అధికారులు వారి బాధ్యతలను విస్మరించడంతో పాటు ఆక్రమణదారులతో కుమ్మక్కై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఏళ్లుగా సాగుతున్న విచారణలు..

దర్గాలు, మసీదులు, పీర్లచావిడీలు, ఖాజీల పేరుతో ఉన్న భూములను సాగు చేసుకొనేలా తమకు హక్కు కల్పించాలని, తమకే భూములు ఇవ్వాలని వివిధ గ్రామాలకు చెందిన నిర్వాహకులు వక్ఫ్ బోర్డు అధికారులకు అర్జీలు పెట్టుకున్నారు. నిజమైన హక్కుదారులు ఎవరన్న విషయంపై అధికారులు ఏళ్లుగా విచారిస్తున్నారే తప్పా ఇప్పటి వరకు సమస్యను పరిష్కరించడం లేదు.



వక్ఫ్ భూముల గురించి హక్కుదారులను విచారిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు (ఫైల్)

అక్రమ నిర్మాణాలు..

ఆమరచింత మండల కేంద్రం నుంచి పురపాలికగా మారడంతో భూముల ధరలు పెరిగాయి. దీంతో ఖాళీగా ఉన్న వక్ఫ్ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంటకు వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో ఉన్న 11 ఎకరాల వక్ఫ్ భూమి కొందరు, మస్తీపురంలో 7 ఎకరాల భూమిని ముగ్గురు ఆక్రమించారు. నందిమళ్లలో 20 ఎకరాలకు పైగా 12 మంది ఆక్రమించినట్లు సమాచారం. మిగతా గ్రామాల్లోని వక్ఫ్ భూముల పరిస్థితి ఇలాగే ఉంది. వక్ఫ్ భూములను సాగు చేయాలంటే రైతులు ముందుగా అధికారులకు విన్నవించాలి. లేదా వక్ఫ్ బోర్డు నిర్వహించిన వేలంలో పాల్గొని పొందాలనే నిబంధన ఉన్నా ఇక్కడ మాత్రం పట్టించుకోవడం లేదు.

ఐదేళ్ల కిందటే వెలుగులోకి..

వక్ఫ్ భూములు ఆక్రమణకు గురైన విషయం ఐదేళ్ల కిందటే వెలుగులోకి వచ్చింది. అమరచింతలో ఒకరు 7 ఎకరాలు, మరొకరు 4 ఎకరాల భూమిని ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర భూసర్వే సమయంలో వారి పేర్లపై నమోదు చేయించుకొని డిజిటల్ పట్టాదారు పాసుపుస్తకాలు పొందారు. విషయం తెలుసుకున్న కొందరు యువకులు అప్పటి కలెక్టర్ శ్వేతామహంతికి ఫిర్యాదు చేయడంతో జారీ చేసిన పట్టాదారు పాసు పుస్తకాలు రద్దు చేస్తామని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. మండల కేంద్రంలోని హజ్రత్ సయ్యద్‌షా రాజావళి దర్గా పేరున వివిధ సర్వేనంబర్లలో 26.30 ఎకరాలు ఉండగా.. భూమి అంతా కబ్జాదారుల ఆధీనంలో ఉండిపోయింది. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న మరో 45.70 ఎకరాల భూమి పరిస్థితి కూడా అంతే.

వక్ఫ్‌బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశాం..



మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పీర్ల చావిడీలు, మసీదులు, దర్గాలు, ఖాజీల పేరిట ఉన్న భూములను పలువురు ఆక్రమించారని గతంలో వక్ఫ్‌బోర్డు అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాం. రెవెన్యూ అధికారులు సర్వేచేసి గుర్తించిన భూములకు కంచె ఏర్పాటు చేయలేదు. అధికారులు స్పందించి అర్హులకు భూములు అందేలా చర్యలు తీసుకోవాలి.

– అయ్యూబ్‌ఖాన్, అధ్యక్షుడు, మసీద్ కమిటీ, అమరచింత

తాతల కాలం నుంచి సేవలు చేస్తున్నాం..



మా తాతల కాలం నుంచి పీర్లచావిడీల నిర్వహణ చేపడుతున్నాం. మసీదు భూమి మాకు ఇవ్వకుండా ఇతరులు ఆక్రమించుకున్నారు. అధికారులు విచారణ చేపట్టి న్యాయం చేయాలి.

– మైనుద్దీన్, ముర్షీద్, అమరచింత

అధికారులకు నివేదించాం..



మండలంలోని వక్ఫ్ భూములకు సంబంధించిన పూర్తి వివరాలను అప్పటి తహసీల్దార్ ఉన్నతాధికారులకు నివేదించారు. వక్ఫ్ భూములు పార్ట్–బిలో ఉండటంతో భూ విక్రయాలు, కొనుగోళ్ల వ్యవహారంపై నిఘా ఉంచాం.

– షేక్ చాంద్‌పాషా, తహసీల్దార్, అమరచింత

వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



రహదారి విస్తరణ పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

పెబ్బేరు రూరల్: పుర పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెబ్బేరు పుర కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి వార్డుల వారీగా ఉన్న సమస్యలు, పన్ను వసూళ్లు, అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. అనంతరం పుర చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీతో కలిసి పట్టణంలో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. చౌడేశ్వరీదేవి ఉత్సవాలు త్వరలో ప్రారంభం కానున్నాయని.. పనులు త్వరగా ప్రారంభించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. పీజేపీ కాల్వ వెంట శాశ్వత ఫెన్సింగ్ గురించి ఇరిగేషన్ ఏఈతో చర్చించారు. అక్కడే ఉన్న పల్లె ప్రకృతివనాన్ని సందర్శించారు. సంత స్థలానికి సంబంధించిన వివరాలను తహసీల్దార్ లక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. కంభాళాపురం రోడ్‌లో ఉన్న సెగ్రిగేషన్ షెడ్ స్థలాన్ని పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట కమిషనర్ ఆదిశేషు, వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్లు సువర్ణ, వెంకట్రాములు, గోపిబాబు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

‘పది’లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ పవార్

కలెక్టర్ తేజస్ పవార్

వనపర్తిటౌన్: జిల్లాలోని పదోతరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ తేజస్ పవార్ కోరారు. శుక్రవారం జిల్లాలోని పలు ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న అల్పాహారంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 10వ తరగతి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు విద్యాశాఖ, జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే సాధ్యమవుతుందని వివరించారు. లక్ష్య కార్యక్రమం ద్వారా అవసరమైన ప్రణాళికతో విద్యాభ్యాసం చేయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 10 నాటికి సిలబస్ పూర్తయిందని.. 4 రివిజన్ పరీక్షలు, రెండు ప్రీ–ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డీసీఈబీ తయారు చేసిన పరీక్ష పత్రాన్ని విద్యార్థులకు ఇస్తున్నామని.. తద్వారా వారి సామర్థ్యాలు ముందే గుర్తించవచ్చని, దీంతో ఎలా ముందుకెళ్లాలో తెలుస్తుందన్నారు. శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఎస్ఎంసీ సమావేశం నిర్వహిస్తున్నామని.. విధిగా హాజరు కావాలని కోరారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు దినోత్సవం..

జిల్లాలో శని, ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు దినోత్సవం నిర్వహిస్తున్నామని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తేజస్ పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 2024, జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని.. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు సైతం తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. సవరణలు, పోలింగ్‌స్టేషన్ మార్చుకోవాలని అనుకున్న వారు ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి..

ఈ నెల 25న 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని అన్ని విద్యాసంస్థలు, కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్ పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ ‘నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్’ పేరిట నిర్వహిస్తుందని.. ప్రజలందరికి అవగాహన కల్పించేలా, ముఖ్యంగా విద్యార్థులు, దివ్యాంగులను భాగస్వామ్యం చేస్తూ నిర్వహించాలన్నారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, పీఎస్‌యూ, జిల్లా కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బందితో జాతీయ ఓటరు దినోత్సవం ప్రతిజ్ఞ చేయించాలని సూచించారు.

ఏపీఆర్‌ఓగా సుభాష్ నియామకం

జిల్లా సహాయ పౌర సంబంధాల అధికారి (ఏపీఆర్‌ఓ)గా ఔట్ సోర్సింగ్ పద్ధతిన సుభాష్ నియమితులైనట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ శుక్రవారం తెలిపారు. ఏపీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ ఇటీవల రాజీనామా చేయడంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు ఈ నెల 4న ప్రకటన విడుదల చేశామన్నారు. ఇందుకుగాను జర్నలిజం పూర్తి చేసిన ఏడుగురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఆరుగురు హాజరయ్యారని.. రాత, మౌఖిక పరీక్ష ఆధారంగా సుభాష్ ఎంపికైనట్లు వివరించారు.

రెవెన్యూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ..

సమీకృత కలెక్టరేట్‌లో శుక్రవారం రెవెన్యూ డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ తేజస్ పవార్, అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ జిల్లా ఉన్నతాధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ క్యాంపెయిన్‌కు ఏర్పాట్లు పూర్తి

పెబ్బేరు రూరల్: జిల్లాలోని ప్రతి గ్రామంలో శని, ఆదివారం ఓటరు నమోదు స్పెషల్ క్యాంపెయిన్ పక్కాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తేజస్ పవార్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి ఆయన పాల్గొని జిల్లా వివరాలు వెల్లడించారు. జిల్లాలో ఫారం 6, 7, 8కి సంబంధించి 20,569 దరఖాస్తులు వచ్చాయని.. బీఎల్వోలు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. స్పెషల్ క్యాంపెయిన్‌పై ఇప్పటికే మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేపట్టినట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్డీఓ పద్మావతి, తహసీల్దార్లు రమేష్‌రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తేజస్ పవార్, జిల్లా అధికారులు

భక్తిభావం పెంపొందించుకోవాలి

మల్దకల్: ప్రజలు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని బెంగళూరు మఠం గొబ్బూరు సువిదేంద్ర తీర్థులు భక్తులకు సూచించారు. శుక్రవారం ఆదిశిలా క్షేత్రానికి చేరుకున్న ఆయనకు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యశ్చంద్రారెడ్డితో పాటు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సుబ్రహ్మణ్యస్వామి, నాగప్రతిష్ఠాపన కార్యక్రమం పాల్గొన్నారు. అలాగే వేదపాఠశాలలో సంస్థాన పూజలు నిర్వహించి భక్తులకు ప్రవచన సందేశం వినిపించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు సన్మార్గంలో నడుచుకోవాలని వివరించారు. అంతకుముందు ఆలయంలో దాత నాగర్‌దొడ్డి విక్రంసింహారెడ్డి ఏర్పాటు చేసిన తలుపులకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గద్దం కృష్ణారెడ్డి, సత్యారెడ్డి, విక్రంసింహారెడ్డి, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ అర్చకులు మధుసూధనాచారి, బాబురావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అందుబాటులో 75 రకాల వరి వంగడాలు



గోపాల్‌పేట: జాతీయ పరిశోధన కేంద్రంలో మొత్తం 75 రకాల వరి వంగడాలు అందుబాటులో ఉన్నాయని.. రైతులు పూర్తి అవగాహనతో పంటలు సాగు చేయాలని ఐసీఏఆర్ శాస్త్రవేత్త డా. స్వామి సూచించారు. శుక్రవారం రేవల్లి మండలం చెన్నారం రైతువేదికలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ‘నిత్య ఆహారంలో పోషకాల సమతుల్యత’ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అన్నదాతలు నాణ్యమైన పంటలు సాగు చేయడంతో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందని వివరించారు. వ్యవసాయ అధికారులను సంప్రదించి ఎలాంటి వంగడాలు సాగు చేయాలో తెలుసుకోవాలని సూచించారు. ఈ మధ్యకాలంలో డీఆర్ఆర్–48, డీఆర్ఆర్–52, డీఆర్ఆర్–53 రకాలకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగిందని, వీటిలో జింక్, ఐరన్, ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రామేశ్వర్‌రెడ్డి, ఏఓ అనిల్‌కుమార్, వల్లమ్మ, బాలరాజు పాల్గొన్నారు.

కావలి సువర్ణకు ఘన నివాళి



పెబ్బేరు రూరల్: తెలంగాణ అమరవీరురాలు కావలి సువర్ణ వర్ధంతిని శుక్రవారం పెబ్బేరు మండలం వైశాఖాపూర్ ప్రగతి విద్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ అమరుల కుటుంబాల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కావలి మన్యం మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో 1200 మంది ప్రాణాలు అర్పించగా.. చాలా మందిని ఇప్పటి వరకు గుర్తించలేదన్నారు. బిడ్డలను కోల్పోయి కడుపుకోత అనుభవిస్తున్న తల్లిదండ్రులకు ఎలాంటి గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కొత్త ప్రభుత్వం అమరుల కుటుంబాలను గుర్తించాలని కోరారు. కార్యక్రకమంలో ప్రిన్సిపాల్ రిజో పాల్గొన్నారు.

కందికి రికార్డు ధర

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం కందులకు రికార్డు ధర లభించింది. కందులకు క్వింటాలు గరిష్టంగా రూ.9,909, కనిష్టంగా రూ.9,209 చొప్పున పలికింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7 వేలు ఉండగా.. అంతకు మించి ధరలు వస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో సైతం ఇదే ధర గరిష్టం అని మార్కెట్ యార్డు అధికారులు తెలిపారు. అలాగే వేరుశనగ క్వింటాలు గరిష్టంగా రూ.7,611, కనిష్టంగా రూ.4,561, ఆర్ఎన్ఆర్ ధాన్యం క్వింటాలు గరిష్టంగా రూ.2,856, కనిష్టంగా రూ.2,669, హంస రకానికి రూ.1,960 చొప్పున వచ్చాయి.

వేరుశనగ క్వింటా రూ.7,770..

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌కు రైతులు వేరుశనగను అమ్మకానికి తీసుకురాగా.. శుక్రవారం అత్యధికంగా క్వింటాల్ ధర రూ.7,770, మధ్యస్తంగా రూ.7,640, అతి తక్కువగా రూ.6,802 లభించాయి. ఒక్క రోజులోనే క్వింటాల్ వేరుశనగ రూ.300 ధర తగ్గిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. 47 మంది రైతులు 600 క్వింటాళ్ల వేరుశనగను విక్రయించారు.

పాలమూరులో మరో ఇద్దరికి పాజిటివ్

పాలమూరు: జిల్లాలో కొత్త రకం వేరియంట్ వైరస్ వ్యాప్తి క్రమంగా పెరుగుతుంది. దీంతో అనుమానితులు పెరగడంతోపాటు స్వల్పంగా పాజిటివ్ కేసులు పెరిగాయి. శుక్రవారం జనరల్ ఆస్పత్రిలో మొత్తం 98 మంది అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా.. ఇద్దరికి కరోనా పాజిటివ్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఇక ఇప్పటి వరకు జనరల్ ఆస్పత్రిలో 1,666 మంది అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయగా 23 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. ఇందులో కొందరు నారాయణపేట జిల్లాకు చెందిన వారు కాగా.. మరి కొందరు మహబూబ్‌నగర్‌కు చెందిన వారున్నారు. పాజిటివ్ వచ్చిన అందరూ హోం ఐసోలేషన్‌లో ఉన్నారు. ఐదు నుంచి వారంరోజులపాటు ఇంట్లో ఉంటూ వైద్యుల సలహా మేరకు చికిత్స పొందుతున్నారు. దాదాపు అందరికి స్వల్ప లక్షణాలు ఉండటంతో వారం వ్యవధిలో తగ్గిపోతుంది.

ఉన్నది ఒక్కటి.. తీవ్ర పోటీ

- జవహర్ నవోదయలో ప్రవేశాలకు డిమాండ్
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున దరఖాస్తులు
- నేడు ప్రవేశ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు
- ఎంపీలు దృష్టిసారిస్తేనే కొత్త విద్యాలయాలకు అవకాశం



గద్వాల: జవహర్ నవోదయ విద్యాలయంలో చదువుకోవాలనేది ప్రతి విద్యార్థి ఆశ. ఇందుకోసం ఎంతోమంది విద్యార్థులు రేయింబవళ్లు కష్టపడుతుంటారు. తల్లిదండ్రులు సైతం ఆ దిశగా పిల్లలను ప్రోత్సహిస్తుంటారు. గ్రామీణ, పట్టణం తేడా లేకుండా చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను నవోదయలో చేర్పించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ క్రమంలోనే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా (రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో కొన్ని మండలాలు)లో నవోదయ ప్రవేశాలకు పెద్దఎత్తున దరఖాస్తులు చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 6,602 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయనున్నారు.నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెంలోని నవోదయ పాఠశాలలో ఉన్న కేవలం 80 సీట్ల కోసం వీరంతా పోటీపడాల్సి వస్తోంది. ఆదివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష జరగనుంది.

ఈసారి కొత్తవి లేనట్టే..

జిల్లాల పునర్విభజన అనంతరం కొత్త నవోదయ విద్యాలయాలు వస్తే పోటీ తగ్గి ఎక్కువ మంది విద్యార్థులకు అవకాశం వస్తుందని అనేకమంది భావించారు. అయితే ఈ ఏడాదికి కొత్తవి తెలంగాణకు మంజూరు కాలేదు. గత ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వెళ్లినా కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదని తెలుస్తుంది. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం కొత్త నవోదయ విద్యాలయాల కోసం కృషి చేయాల్సిన అవసరం ఉంది.

జిల్లా	పరీక్ష కేంద్రాలు	పరీక్ష రాసే విద్యార్థులు
మహబూబ్‌నగర్	5	1,227
నాగర్‌కర్నూల్	9	2,294
జోగుళాంబ గద్వాల	3	838
వనపర్తి	4	1,046
నారాయణపేట	2	614
రంగారెడ్డి	2	394
వికారాబాద్	1	189

పాత జిల్లాలనే పరిగణనలోకి తీసుకొని విద్యార్థులు ఈ ఏడాది కూడా సీట్ల కోసం తీవ్ర పోటీ పడాల్సిందే. రాష్ట్రంలో పూర్వం 10 జిల్లాలు ఉండగా.. వీటిలో అర్బన్ జిల్లాకు నవోదయ విద్యాలయాలు ఉండవు. ఈ నేపథ్యంలో మిగతా 9 జిల్లాల పరిధిలో తొమ్మిది నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. ప్రతి విద్యాలయంలో 80 సీట్లు ఉంటాయి. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో కొత్తగా ఏర్పడి జోగుళాంబ గద్వాల జిల్లాకు నవోదయ విద్యాలయం మంజూరైతే ఇక్కడి విద్యార్థులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. అక్షరాస్యతలో ఈ జిల్లా పూర్తిగా వెనకబడి ఉంది. ఈ ప్రాంతంలో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేస్తే అక్షరాస్యత పెంపుతోపాటు విద్యాభివృద్ధికి బాటలు వేసినట్లవుతుంది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల అనంతరం గెలిచే అభ్యర్థులు కొత్త నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కృషి చేయాల్సి ఉంది. ఆ దిశగా గెలుపొందే ఎంపీలు నవోదయ విద్యాలయాల కోసం ఉద్యమించాల్సి ఉంది.

నాణ్యమైన విద్య..

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల మోత.. అర్హులైన అధ్యాపకుల లేమి.. వంటి సమస్యలు పూర్తి స్థాయిలో నాణ్యమైన విద్యను అందించలేకపోతున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు నిర్వహించే అర్హత పరీక్షలో ఒకసారి ప్రవేశం లభిస్తే 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు అందులోనే మెరుగైన విద్య అందుతుంది. క్రీడలకూ ఇక్కడ ప్రాధాన్యం ఇస్తారు. వసతి, భోజనం, పుస్తకాలు, స్టేషనరీ, ఏకరూప దుస్తులు తదితర అన్నింటినీ కేంద్ర ప్రభుత్వమే సమకూరుస్తుంది.

ఏర్పాట్లు పూర్తిచేశాం..



జవహర్ నవోదయ విద్యాలయం 2024– 25 విద్యా సంవత్సరం ఆరో తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మొత్తం 26 పరీక్ష కేంద్రాల్లో 6,602 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. విద్యార్థులు నిర్ణీత సమయానికి 40 నిమిషాల ముందే కేంద్రానికి చేరుకోవాలి.

– భాస్కర్‌కుమార్, ప్రిన్సిపల్, జవహర్ నవోదయ విద్యాలయం, వట్టెం

కొత్త మొక్కను గర్తించిన కల్వరాళ్ల వాసి



ఆంథ్రోగ్రాఫిస్ థెనియెన్సిస్ మొక్క



భరతసింహ యాదవ్

వీపనగండ్ల: వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం కల్వరాళ్ల గ్రామానికి చెందిన విద్యార్థి భరతసింహయాదవ్ ఆంథ్రోగ్రాఫిస్ థెనియెన్సిస్ అనే కొత్త మొక్కను కనుగొన్నారు. భరత్ తమిళనాడులోని ది మధుర కాలేజ్‌లో ప్రొఫెసర్ కురుప్‌స్వామి ఆధ్వర్యంలో వృక్షశాస్త్రంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఆంథ్రోగ్రాఫిక్ జాతికి చెందిన ఈ మొక్కలు జలుబు, దగ్గు, జ్వరం, కామెర్లు, విరేచనాలు తదితర వ్యాధుల చికిత్సలో ఎంతో ఉపయోగపడతాయి. ప్రస్తుతం ఈ మొక్క అంతరించిపోయే దశలో ఉందని విద్యార్థి భరతసింహ పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మారుమూల ప్రాంతానికి చెందిన భరత్ సొంత గ్రామంలో ప్రాథమిక విద్య పూర్తి చేసి ఇంటర్, డిగ్రీ వనపర్తిలో చదువుకున్నాడు. పశ్చిమ కనుమల్లో అంతరించి పోతున్న మొక్కల జీవిత చక్రం అనే అంశంపై పరిశోధనలు చేస్తున్నారు.

ధర్మో రక్షతి రక్షితః

- ఆధ్యాత్మిక మఠాలు.. సేవా కార్యక్రమాలకు వేదికలు
- ధర్మజాగృతి సభలో శ్రీశైలం పీఠాధిపతి శివాచార్య మహాస్వామి



ధర్మజాగృతి సభలను ప్రారంభిస్తున్న శివాచార్య మహాస్వామి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్

నవాబుపేట: ధర్మాన్ని రక్షిస్తే.. ధర్మం మనల్ని సంరక్షిస్తుందని శ్రీశైలం పీఠాధిపతి శివాచార్య మహాస్వామి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలోని కొల్లూర్ చింతలపురి చిన్నయ్యస్వామి మఠంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ధర్మజాగృతి సభను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివాచార్య మహాస్వామి మాట్లాడుతూ ఆధ్యాత్మిక మఠాలు పూర్వం నుంచే సేవా కార్యక్రమాలకు మూలంగా మారాయన్నారు. మనుషుల్లో సేవా గుణం చాలా ముఖ్యమని.. సేవా గుణంతో ఎంతటి లక్ష్యాన్ని అయినా సులభంగా పొందే అవకాశం ఉంటుందన్నారు. దైవ చింతనతో తపస్సు చేసుకునే వారిలో కొందరు అవతార పురుషులు మఠాలను ఏర్పాటు చేసుకుని, సేవా కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. వారి స్ఫూర్తితో ప్రస్తుతం చాలా మఠాలు వెలసి, భక్తి మార్గం బోధించడంతో పాటు అభాగ్యుల ఆకలి తీరుస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకోవాలని సూచించారు.

ఉప్పొంగిన భక్తిపారవశ్యం

కొల్లూర్ చింతలపురి చిన్నయ్యస్వామి మఠం రజతోత్సవం సందర్భంగా భక్తిపారవశ్యం ఉప్పొంగింది. ఉత్సవాల్లో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఎమ్మెల్యేలు మఠం ముఖద్వారం ప్రారంభించారు. అలాగే మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు, ధర్మజాగృతి సభలను ఆరంభించారు. దీంతో ఎక్కడ చూసినా భక్తుల సమూహం.. స్వామిజీల ధర్మబోధనలతో గ్రామం మార్మోగింది. భక్తుల రాకపోకలు, ప్రముఖుల బోధనలు, పూజలతో చిన్నయ్యస్వామి మఠం సందడిగా మారింది. చిన్నారులు నిర్వహించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. శనివారం షష్టిపూర్తి మహోత్సవం, పీఠాధిపతి ప్రవచనాలు, ఆదివారం 218 హోమ గుండాలతో రుద్రాహోమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



చిన్నారి నృత్య ప్రదర్శన

దైవ చింతనతో మనశ్శాంతి

- మంత్రి పొన్నం ప్రభాకర్

దైవ చింతనతో మనశ్శాంతి లభిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మానసిక ఒత్తిడికి గురయ్యే వారు దైవచింతన అలవర్చుకోవడం వల్ల మనశ్శాంతితో పాటు ఆయుష్షు పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. నిత్యం బిజీగా ఉండే రాజకీయ నాయకులకు ఇలాంటి ధర్మజాగృతి కార్యక్రమాలతో ఒత్తిడి దూరమై, ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, శంకర్, డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు అందరికీ అవసరమన్నారు. ధర్మ రక్షణకు పాటుపడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రితో పాటు ఎమ్మెల్యేలను పీఠాధిపతి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చిన్నయ్యస్వామి మఠం పీఠాధిపతి సదీశ్వరస్వామి, బంగ్లా రవి, సర్పంచ్ రఘు, ఉపసర్పంచ్ నర్సింహాచారి, ఎంపీటీసీ తులసీరాం, రాజు, గోపాల్ గౌడ్, ఖాజా, వాసుయాదవ్, కృష్ణ పాల్గొన్నారు.

ఉమామహేశ్వరం.. భక్తజన సందోహం



శేషవాహనంపై ఊరేగుతున్న ఉమామహేశ్వరస్వామి

- వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు
- శేషవాహనంపై ఊరేగిన ఉమామహేశ్వరుడు

అచ్చంపేట: నల్లమల కొండల్లో కొలువుదీరిన ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలొచ్చి పార్వతీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. ముందుగా పాపనాశిని గుండం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. ఈ సందర్భంగా శివనామస్మరణ మార్మోగింది. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు.

కనులపండువగా శేషవాహన సేవ..

ప్రదోష కాలంలో ఉమామహేశ్వరస్వామికి శేషవాహన సేవ నిర్వహించారు. అశేష భక్తజనం మధ్య స్వామివారికి శేషవాహన సేవ కనులపండువగా సాగింది. ఆలయం నుంచి పాపనాశిని గుండం వరకు ఊరేగింపు నిర్వహించారు. అదేవిధంగా గవ్యాంత పూజలు, రుద్రాభిషేకం, రుద్రహోమం, ఆవాహిత దేవతా హోమాలు, మూర్తి హోమం, శేషహోమం, పూర్ణాహుతి, వసంతోత్సవం, త్రిశూల స్నానం, ధ్వజావరోహణం, పుష్పోత్సవం, ఏకాంత సేవ, మహాశీర్వచనం, పండిత సత్కారం కార్యక్రమాలను పండితులు వీరయ్యశాస్త్రి, నీరకంఠశాస్త్రిల పర్యవేక్షణలో నిర్వహించారు.



ఉత్సవమూర్తులకు త్రిశూలస్నానం నిర్వహిస్తున్న పండితులు



భక్తులతో కిటకిటలాడుతున్న కొండ

నిరంజన్‌షావలీ దర్గాలో జారత్

రంగాపూర్ నిరంజన్‌షావలీ ఉర్సులో భాగంగా శుక్రవారం జారత్ నిర్వహించారు. ముస్లింల ప్రత్యేక ప్రార్థనల అనంతరం మసీదు కమిటీ ఆధ్వర్యంలో దర్గా ఆవరణలో జారత్ గానం చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలొచ్చారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఫాతేహాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు కందూరు నిర్వహించారు.



నిరంజన్‌షావలీ దర్గాలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

మోటార్ల కేబుల్ చోరీ

- నెల రోజుల వ్యవధిలోనే రెండు సార్లు అపహరణ



ధరూరు: ధరూరు మండలంలో వ్యవసాయ మోటార్ల కేబుల్ చోరీ కలకలం సృష్టిస్తోంది. నెలరోజుల వ్యవధిలోనే రెండు సార్లు మోటార్ల కేబుల్‌ను చోరీ చేయడంపై రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గత డిసెంబర్ 20న గుర్తు తెలియని దుండగులు మోటార్ల కేబుల్ చోరీ చేశారు. నెల రోజులు కూడా గడవక ముందే మరో సారి రైతుల మోటార్లపై దొంగలు పడ్డారు. జాంపల్లి శివారులోని నెట్టెంపాడు ప్రధాన కాల్వ వెంట రైతులు అమర్చుకున్న వ్యవసాయ మోటార్ల కేబుల్‌ను శుక్రవారం చోరీ చేశారు. ఉదయం పొలానికి నీళ్లు పారించేందుకు వెళ్లిన రైతులు.. కేబుల్ చోరీ విషయాన్ని గుర్తించి లబోదిబోమన్నారు. దాదాపు 40 మంది రైతులకు చెందిన కేబుల్‌ను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. వరుస చోరీలు చోటుచేసుకోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది రూపాయలతో కేబుల్‌ను కొనుగోలు చేస్తున్నామని, తమ గోడును పట్టించుకునే వారే కరువయ్యారని వాపోయారు. పండిన పంటలో వచ్చిన ఆదాయం కంటే.. కేబుల్‌కే ఎక్కువగా ఖర్చు పెట్టాల్సి వస్తోందన్నారు. ఈ ప్రాంతంలో పేకాట ఆడి నష్టపోయిన వాళ్లే చోరీకి పాల్పడుతున్నారనే అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై రేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



వీరేష్ (ఫైల్)

కృష్ణా: మండలంలోని నల్లగట్టు సమీపంలో ఉన్న ఇటుకల బట్టీలో విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతిచెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. గుడెబల్లూరుకు చెందిన రాయచూర్ అంజప్ప నల్లగట్టు సమీపంలో ఇటుకల బట్టీ ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆయన కుమారుడు వీరేష్ (23) ఇటుకలను క్రేన్ సాయంతో తరలించే క్రమంలో 33 కేవీ విద్యుత్ తీగలు క్రేన్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఒక్కగానొక్క కుమారుడు విద్యుదాఘాతంతో మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ విజయభాస్కర్ వివరించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బాలానగర్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో నర్సింహులు(42) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని గౌతాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. వ్యాధి తగ్గకపోవటంతో మానసికంగా కుంగిపోయి శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

2.730 మి.గ్రా. బంగారంతో అయోధ్య రామమందిరం




2.730 మిల్లీ గ్రాముల బంగారంతో తయారు చేసిన అయోధ్య రామమందిరం



కపిలవాయి గోపిచారి

అమ్రాబాద్: అయోధ్య రామమందిరంలో బలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌కు చెందిన స్వర్ణకారుడు కపిలవాయి గోపిచారి 2.730 మిల్లీ గ్రాముల బంగారంతో రామమందిరం రూపొందించి, తన భక్తిని చాటుకున్నారు. రూ.16వేల విలువజేసే బంగారంతో 1.5 సెం.మీ. ఎత్తు, 1.75 సెం.మీ. వెడల్పు, 2.75 సెం.మీ. పొడవుతో 108 స్తంభాలు, 20 గోపురాలు వచ్చే విధంగా అతిసూక్ష్మ కళాఖండాన్ని రూపొందించారు. 21 రోజులు శ్రమించి రామమందిరం తయారు చేసినట్లు ఆయన తెలిపారు. గతంలో గోపిచారి చంద్రయాన్–2 నమూనా, స్వాతంత్ర్య, గణతంత్ర, తెలుగుభాషా దినోత్సవాల సందర్భంగా అతి తక్కువ బంగారంతో జాతీయ జెండాలు, రథాలు, చంద్రయాన్–3 నమూనాతో పాటు 2023లో జరిగిన ప్రపంచ కప్, పిచ్, వికెట్లు తదితర పరికరాలను తయారుచేసి అబ్బురపరిచారు.

పెన్సిల్ కార్వింగ్‌తో..



పెన్సిల్ లిడ్‌పై తీర్చిదిద్దిన అయోధ్య రామమందిరం నమూనా



సంతోష్‌చారి

జడ్చర్ల టౌన్: జడ్చర్ల పట్టణానికి చెందిన సంతోష్‌చారి పెన్సిల్ లిడ్‌పై కార్వింగ్ చేసి, అయోధ్య రామమందిరం నమూనా తీర్చిదిద్దారు. మైక్రో ఆర్ట్‌తో రామమందిరాన్ని సుందరంగా రూపొందించారు. గతంలోనూ కేసీఆర్ విగ్రహం తయారుచేసి ప్రశంసలు పొందారు. 48 గంటల ఉపవాస దీక్ష చేపట్టి, పెన్సిల్ లిడ్స్‌తో ఒక అంగుళం పొడవు, 1.5 అడుగుల వెడల్పు సైజుతో అరచేతిలో ఇమిడి ఉండే అయోధ్య రామమందిరం తయారు చేసినట్లు తెలిపారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవం

కొల్లాపూర్ రూరల్: కొల్లాపూర్ మండలంలోని సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణిలో స్వామి వారికి తెప్పోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వేదమంత్రోచ్చారణలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తెప్పలోకి చేర్చి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుష్కరిణిలో స్వామివారు విహరించారు. అదేవిధంగా గరుడవాహన సేవ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆదిత్య లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.



పుష్కరిణిలో విహరిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

బంగారం, వెండి కోసం మహిళల హత్య



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలు

- ఇద్దరు నిందితుల అరెస్టు
- 5.8 తులాల బంగారం, 650 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం: బంగారం, వెండి ఆభరణాల కోసం ఓ మహిళ, వృద్ధురాలిని హతమార్చిన ఇద్దరు నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకున్న రెండు హత్య కేసులకు సంబంధించిన వివరాలను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ వెల్లడించారు. కల్వకుర్తి పట్టణానికి చెందిన వరికుప్పల వెంకటేష్, తెల్కపల్లి మండలం వట్టిపల్లికి చెందిన కల్మూరి అలివేల 4 నెలలుగా సహజీవనం చేస్తున్నారు. ఇరువురు కలిసి బస్టాండ్లు, కల్లు కంపౌండ్‌ల వద్ద బంగారం కలిగి ఉన్న మహిళలు, వృద్ధులతో మాటలు కలిపేవారు. కల్లు తాగి మత్తులోకి జారుకున్న తర్వాత వారిని అటవీ ప్రాంతాల్లోకి తీసుకెళ్లి హత్యలకు పాల్పడేవారు. ఈనెల 15న కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామానికి చెందిన నాగమ్మ (60)తో కల్వకుర్తి బస్టాండ్‌లో మాటలు కలిపారు. తాము తర్నికల్ వైపే వెళ్తున్నామని నమ్మించి, ఆటోలో ఎక్కించుకున్నారు. ఆమెను నల్లమల అటవీ ప్రాంతంలో హత్య చేసి, బంగారం ఆభరణాలను తీసుకువెళ్లారు. అదే విధంగా ఈనెల 13న ఉప్పునుంతలకు చెందిన బాలకిష్టమ్మ (45)కు కల్లు తాగించిన తర్వాత నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లి హత్యకు పాల్పడ్డారు. ఆమె కోసం రెండు రోజుల పాటు ఎదురుచూసిన కుటుంబ సభ్యులు.. కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బల్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలకిష్టమ్మ మృతదేహం లభ్యం కాగా.. అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. గురువారం కల్వకుర్తిలో వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులను చూసిన నిందితులు వరికుప్పల వెంకటేష్, కల్మూరి అలివేలు పారిపోతుండగా.. అదుపులోకి తీసుకుని విచారించడంతో హత్య నేరాలను ఒప్పుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి 5.8 తులాల బంగారం, 650 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ 4లక్షలు ఉంటుందని వెల్లడించారు. వరికుప్పల వెంకటేష్ 6 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, హత్యలకు పాల్పడిన ఇద్దరిని రిమాండ్‌కు తలించినట్లు తెలిపారు. హత్య కేసులను ఛేదించిన పోలీసు సిబ్బందికి ఎస్పీ రివార్డులు అందజేశారు. సమావేశంలో కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి, సీఐలు సోమనర్సయ్య, అనుదీప్, ఎస్ఐలు రమేష్, కిషన్ ఉన్నారు.

పురుగు మందులతో జాగ్రత్త



- కూరగాయల్లో క్రిమిసంహారక మందుల అవశేషాలు
- వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంట కోతలు చేపట్టాలి

అలంపూర్: కూరగాయల్లో పురుగు మందుల అవశేషాలు లేకుండా ఉండాలంటే రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. చీడపీడల నివారణ కోసం పురుగు మందులు వాడటం వల్ల కూరగాయల్లో వాటి అవశేషాలు ఉంటాయి. మందులు పిచికారీ చేసిన వెంటనే లేదా ఒకట్రెండు రోజుల్లో కూరగాయలను కోయడం మంచిది కాదు. పురుగు మందుల అవశేషాలతో రోగాలు సంభవించే అవకాశం ఉంటుంది. పురుగు మందులను పిచికారీ చేసిన తర్వాత ఏ పంటను ఎన్ని రోజులకు కోయాలనే దానిపై వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని కోరారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఇంటికి తీసుకెళ్లిన కూరగాయలను శుభ్రం చేయకుండా వాడరాదు.
- ఉప్పు కరిగించిన నీటిలో (2 శాతం ద్రావణం) కనీసం 10 నిమిషాలు నానబెట్టిన తర్వాత శుభ్రం చేసుకుని వినియోగించుకోవాలి.
- క్యాబేజీపై ఒకటి, రెండు పొరలు తీసివేస్తే అవశేషాలు తొలగిపోతాయి.
- క్యాలీఫ్లవర్‌లో అవశేషాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి పువ్వును వేర్వేరు చేసి ఉప్పు ద్రావణంలో కడగాలి.
- ఆకుకూరలు, కొతిమీరను కూడా బాగా కడిగి వాడాలి.
- భూమి లోపల ఉత్పత్తి అయ్యే దుంపలపై మందుల అవశేషాలు తక్కువగా ఉంటాయి.
- పక్వానికి వచ్చిన బెండ కాయలు ఒకట్రెండు రోజుల్లో ముదురుతాయి. కాబట్టి మందును కాయలు కోసే ముందు పిచికారీ చేయడం మంచిది కాదు. ఒకవేళ పిచికారీ చేయాల్సి వస్తే.. బెండకాయలు వాడినప్పుడు ఉప్పు ద్రావణంలో జాగ్రత్తగా కడిగి వినియోగించాల్సి ఉంటుంది.

మందుల పిచికారీ తర్వాత కూరగాయలు తెంచేందుకు గడువు ఇలా..(రోజుల వారీగా)

పురుగు మందు	మిరప	బెండ	వంగ	టమాట	క్యాబేజ	క్యాలీఫ్లవర్
కార్బరిల్	5	2	1	2	4	5
మోనోక్రోటోఫాస్	10	13	-	5	-	-
ఫాసలోన్	6	7	5	3	10	10
డైమిథోయేట్	6	-	7	-	-	-
సైపర్ మెత్రిన్	7	7	5	5	7-10	10
క్వినాల్‌ఫాస్	7	15	-	5	5	-
ఫేన్‌వలరేట్	20	7	8	10	12	-
మలాథీయాన్	-	2	2	4	5	5



మిరప తోట

తప్పిన పెను ప్రమాదం



ప్రమాదానికి గురైన వోల్వో బస్సు

అడ్డాకుల: 44వ జాతీయ రహదారిపై శుక్రవారం పెను ప్రమాదం తప్పింది. రన్నింగ్‌లో ఉన్న వోల్వో బస్సు ముందు టైరు ఊడిపోయి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీఎంఆర్ ఎక్స్‌ప్రెస్ వోల్వో బస్సు గురువారం రాత్రి 7గంటలకు బెంగళూర్ నుంచి సుమారు 30 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయల్దేరింది. శుక్రవారం తెల్లవారుజామున అడ్డాకుల విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో బస్సు కుడివైపు ముందు టైరు అకస్మాత్తుగా ఊడిపోయింది. అప్రమత్తమైన డ్రైవర్ రాజు బస్సును నియంత్రించి రోడ్డు పక్కన నిలిపాడు. ముందు టైరు ఊడిపోయిన చోట రోడ్డుకు రాపిడి జరగడంతో స్వల్పంగా మంటలు చెలరేగాయి. దాన్ని గుర్తించిన డ్రైవర్ రాజు.. మరో డ్రైవర్ వినయ్‌తో కలిసి మంటలను అదుపు చేశారు. ప్రయాణికులను మరో వాహనంలో పంపించారు. రహదారి నిర్వాహణ సిబ్బంది బస్సు వద్ద సూచికలను ఏర్పాటు చేశారు. బస్సు డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెద్ద ముప్పు తప్పినట్లయింది.

క్లుప్తంగా...

మరో రూ. రెండు వేల కోట్ల రుణం

బాండ్ల వేలం వేసి ఆర్‌బీఐ ద్వారా సర్కారు సేకరణ

సాక్షి, హైదరాబాద్: ఈ నెలలో తెలంగాణ ప్రభుత్వరుణాలు రూ.2 వేల కోట్లకు చేరనున్నాయి. రుణాల కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ద్వారా సెక్యూరిటీ బాండ్ల వేలం వేస్తోంది. ఈ మొత్తంలో రూ.వెయ్యికోట్లను ఈ నెల 16వ తేదీన తీసుకోగా, మరో రూ.వెయ్యి కోట్లను 23న సమకూర్చుకోనుంది. ఈ మేరకు ఆర్‌బీఐ షెడ్యూల్ విడుదల చేసింది. గత డిసెంబర్‌లో రూ.1,400 కోట్ల రుణాలను బహిరంగ మార్కెట్‌లో సేకరించిన ప్రభుత్వం జనవరిలో మరో రూ.రెండు వేల కోట్లను సమకూర్చుకోనున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ అప్పుల పద్దు రూ.3,400 కోట్లకు చేరనుంది.

వ్యవసాయేతర రుణాలను వసూలు చేయాలి

మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: డీసీసీబీలు, ప్యాక్స్‌ల్లో వ్యవసాయేతర రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని ఎగవేతదారుల నుంచి బకాయిలను వసూలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంత్రి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ పర్యటన సందర్భంగా రైతుల విజ్ఞప్తి మేరకు ప్యాక్స్ నిబంధనలకు విరుద్ధంగా రుణాలు తీసుకుని బకాయిలు చెల్లించనివారిపై కఠినచర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్యాక్స్‌లను బలోపేతం చేయాలని కోరారు. తమది రైతు ప్రభుత్వమని, రైతుల మేలు కోరే ప్రభుత్వమని మంత్రి పేర్కొన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

చౌటుప్పల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ చేనేత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన గుగ్గిళ్ల నరేశ్(32) చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి కొండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ధనుంజయ్య తెలిపారు.

తెలంగాణకు మరిన్ని కేంద్ర సంస్థలు



ఇన్వెంటివ్-2024 ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

ఐఐటీ హైదరాబాద్‌లో ఇన్వెంటివ్-2024 ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

- వెయ్యి కోట్లతో సమ్మక్క సారక్క గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేశాం
- అభివృద్ధి భారత్ లక్ష్యాన్ని సాధించడానికి స్టార్టప్‌లే వెన్నెముక
- దేశాన్ని మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా మార్చాలని పిలుపు
- ఐఐటీల్లో ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: డిజిటైజేషన్, డిస్టెన్స్ లెర్నింగ్ మెథడాలజీ, ఆన్‌లైన్ అప్రోచ్, డిజిటల్ నెట్ వర్కింగ్ వంటి అంశాలకు సంబంధించి తెలంగాణలో కేంద్ర సంస్థలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. తెలంగాణలో ఇటీవలే రూ.వెయ్యి కోట్లతో సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ప్రాచీన భారతం ఎన్నో ఆవిష్కరణలకు భూమికగా నిలిచిందని.. ఆధునిక భారతం విశ్వమిత్రగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. 'జై విజ్ఞాన్, జై అనుసంధాన్' నినాదంతో దేశయువత భారత్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ లీడర్‌గా మారుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఐఐటీ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఉన్నత విద్యా సంస్థల రెండో ఎడిషన్ 'ఇన్వెంటివ్, ఆర్‌అండ్‌డీ ఇన్నోవేషన్ ఫెయిర్'ను ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం ప్రారంభించారు. రెండు రోజుల ఈ సదస్సులో ఐఐటీలు, ఇతర ప్రముఖ విద్యా సంస్థలు కలిపి మొత్తం 53 విద్యా సంస్థల నుంచి 120 ఆవిష్కరణలను ప్రదర్శనకు పెట్టారు. హెల్త్‌కేర్, అగ్రికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, క్లైమేట్ చేంజ్, ఈ–మొబిలిటీ, క్లీన్ ఎనర్జీ, డిఫెన్స్ అండ్ స్పేస్, ఇండస్ట్రీ 4.0 తదితర ఇతివృత్తాలతో వీటిని రూపొందించారు.

దేశాన్ని తయారీ కేంద్రంగా మారుస్తాం

ప్రజల రోజువారీ జీవితంలో ఉపయోగపడేలా సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఐఐటీలకు ప్రధాని మోదీ సూచించినట్లు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గుర్తు చేశారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్న కల సాకారంలో స్టార్టప్ కంపెనీలు వెన్నెముకగా నిలుస్తాయని.. ఇన్వెంటివ్–2024 వంటి సమావేశాలు రోడ్ మ్యాప్‌గా ఉపయోగపడతాయని చెప్పారు. నూతన ఆవిష్కరణలు మరింత పెరిగేలా విద్యాసంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమ అంతా సహకారం అందించాలని కోరారు. దేశ జీడీపీలో కనీసం 25 శాతానికి దోహదపడేలా భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చడమే లక్ష్యమని వివరించారు. ఆ దిశగానే 'మేక్ ఇన్ ఇండియా, ఇన్వెస్ట్ ఇన్ ఇండియా, పీఎల్‌ఐ స్కీమ్, ఎఫ్‌డీఐ లిబరలైజేషన్'వంటి విధానాలను కేంద్రం తీసుకొచ్చిందన్నారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డొమైన్‌లో 46 శాతం గ్లోబల్ డిజిటల్ లావాదేవీలు భారత్‌లోనే జరుగుతున్నాయని, మనదేశం ఇన్నోవేషన్‌కు ఇంక్యుబేటర్‌గా మారిందని చెప్పారు. 2014లో 350 స్టార్టప్ కంపెనీలు ఉంటే.. ఇప్పుడవి లక్షా 20వేలకు చేరాయన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు చర్యలు

విద్యార్థుల ఆత్మహత్యలు సమాజానికి మంచిది కాదని కేంద్ర మంత్రి అన్నారు. ఐఐటీల్లో ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థుల ఆత్మహత్యల నివారణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టిపెట్టాయన్నారు.

పెట్టుబడుల కోసం అదానీని కలిస్తే తప్పేంటి?

- బావ బావమరిది పోటీపడి కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు
- డిపాజిట్లు రావనే బీజేపీ నేతలతో మంతనాలు: మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పెట్టుబడుల కోసం, పరిశ్రమల ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి దావోస్‌లో పారిశ్రామికవేత్త అదానీని కలిస్తే తప్పేంటని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. దాన్ని కూడా విమర్శిస్తున్నారని, ఆ మాత్రం కామన్‌సెన్స్ కేటీఆర్‌కు లేదా అని జూపల్లి నిలదీశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌కి చెందిన బావ బావమరుదులు హరీశ్, కేటీఆర్ పోటీపడి కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు కోసం బీఆర్‌ఎస్ తెర వెనుక యత్నాలు సాగిస్తోందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి డిపాజిట్లు రావని నిర్ధారించుకున్న తర్వాతే బీఆర్‌ఎస్‌ను బతికించుకునేందుకు బీజేపీ నేతలతో మంతనాలు సాగిస్తున్నారని విమర్శించారు.

హరీశ్‌వి ఝూటా మాటలు

కేసీఆర్ బంగారు పళ్లెంలో పెట్టి రాష్ట్రాన్ని కాంగ్రెస్ చేతిలో పెట్టారంటూ హరీశ్ ఝూటా మాటలు మాట్లాడుతున్నారని జూపల్లి విమర్శించారు. కేసీఆర్ రూ.ఏడు లక్షల కోట్ల అప్పుల్లో రాష్ట్రాన్ని ముంచారని, ఆయన నిర్వాకాన్ని మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రజల ముందు బట్టబయలు చేశామన్నారు. ఇంత అప్పుల భారం ఉన్నా ప్రజల కిచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అత్యధిక స్థానాలను హస్తగతం చేసుకుంటుందన్నారు.

గల్ఫ్ ఏజెంట్ల ఇంట్లో సీఐడీ సోదాలు

కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్లలోని ముగ్గురు గల్ఫ్ ఏజెంట్ల ఇళ్లలో సీఐడీ అధికారులు సోదాలు చేశారు. ఈ సోదాల్లో కొన్ని పాస్‌పోర్టులు, నకిలీ ధ్రువపత్రాలు, స్టాంపులతో పాటు ఓ గల్ఫ్ ఏజెంట్ ఇంట్లో రూ.2 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ సోదాలు జరిగాయి. కోరుట్లకు చెందిన అశోక్‌రావు, చాంద్, ఖమర్‌లు కొన్నేళ్లుగా పాస్‌పోర్టులు ఇప్పిస్తూ గల్ఫ్ ఏజెంట్లుగా చెలామణి అవుతున్నారు. ల్యాప్‌టాప్‌లు, బ్యాంక్ అకౌంట్ బుక్‌లు, పదోతరగతి మెమోలు, బోనఫైడ్ సర్టిఫికెట్లు, స్టాంపులు, ఇతరత్రా నకిలీ ధ్రువపత్రాలు స్వాధీనం చేసుకొని ముగ్గురు ఏజెంట్లతో పాటు, ఓ ఏఎస్‌ఐని అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కు తరలించినట్టు తెలిసింది.

నకిలీ పాస్‌పోర్టు ఆధారంగా..

నెలరోజుల క్రితం జగిత్యాల జిల్లాకు చెందిన ఓ వ్యక్తి గల్ఫ్‌కు వెళ్లాడు. అక్కడి ఎయిర్‌పోర్టులో అతడిది నకిలీ పాస్‌పోర్టు అని గుర్తించిన ఇమిగ్రేషన్ అధికారులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఇండియన్ ఎంబసీకి సమాచారం ఇచ్చారు. ఈ సమాచారం మేర కు అప్రమత్తం అయిన హైదరాబాద్ పోలీసులు కేసును సీఐడీకి అప్పగించినట్టు సమాచారం. నకిలీ పాస్‌పోర్టు జారీ చేసే సమయంలో సదరు ఏఎస్‌ఐ జగిత్యాల స్పెషల్ బ్రాంచ్‌లో పని చేస్తున్నాడు.

నకిలీ ధ్రువపత్రాల ఆరోపణలు

అశోక్‌రావు, చాంద్, ఖమర్‌లు పదేళ్లక్రితం పాస్‌పోర్టులు ఇప్పించే సమయంలో కంపెనీలు వీసాల కోసం జతచేసే ఈసీఎన్‌ఆర్ క్లియరెన్స్‌కు దరఖాస్తుదారు చదువుకోకున్నా, కొన్ని విద్యా సంస్థలకు చెందిన నకిలీ ధ్రువపత్రాలు తయారు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా నకిలీ పత్రాలతో పదోన్నతులు పొందిన కొంతమంది ఉపాధ్యాయులు సైతం రివర్షన్‌కు గురయ్యారని సమాచారం. మళ్లీ నకిలీ ధ్రువపత్రాలు తయారుచేస్తున్నారన్న సమాచారంలో సీఐడీ అధికారులు సోదాలు చేసినట్టుగా ప్రచారం జరుగుతోంది.

విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు పెంచండి

- సోలార్ విద్యుత్ వినియోగం, ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి: భట్టి

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులను ఆదేశించారు. పెట్రోల్, డీజిల్ వాహనాలతో పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడంతో పాటు ఇంధన పొదుపులో భాగంగా మార్కెట్లోకి వస్తున్న విద్యుత్ వాహనాలకు చార్జింగ్ అందించడానికి అన్ని ప్రాంతాల్లో చార్జింగ్ స్టేషన్లు నెలకొల్పాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు. రాష్ట్రంలో అమలవుతున్న సౌర, పవన, జల విద్యుత్ ఉత్పత్తి కార్యక్రమాలపై డిప్యూటీ సీఎం శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో విద్యుత్ కొరత రాకుండా సౌర విద్యుత్‌ను పెద్ద మొత్తంలో వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్రంలోని జలాశయాలపై సోలార్ ప్రాజెక్టుల నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ రూఫ్‌టాప్ సిస్టం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సంప్రదాయేతర ఇంధన విద్యుదుత్పాదనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిని తక్షణమే పరిశీలించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

ఆ రాయితీలను ప్రజలకు వివరించండి

రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి పెంచడానికి గృహ వినియోగదారులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించి ప్రోత్సహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. గృహ వినియోగదారులు ఒక కిలో వాట్ సౌర విద్యుత్ ఉత్పత్తి ప్యానెల్స్ ఏర్పాటు చేస్తే..రూ. 18 వేలు రాయితీ ప్రభుత్వం ఇస్తున్న విషయాన్ని ప్రచారం చేయాలన్నారు. మూడు కిలో వాట్స్ నుంచి పది కిలో వాట్స్ వరకు కిలో వాట్ కు రూ. 9 వేలు లెక్కన ప్రభుత్వం రాయితీ ఇస్తోందనీ, దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

బీసీల బడ్జెట్ రూ. 20 వేల కోట్లకు పెంచాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రమిచ్చిన ఎంపీ కృష్ణయ్య



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: వచ్చే బడ్జెట్‌లో బీసీల కేటాయింపులను రూ.20 వేల కోట్లకు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, కోట్ల శ్రీనివాస్, టి.రాజ్‌కుమార్ శుక్రవారం సచివాలయంలో మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. బీసీల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని భట్టికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్‌కు సబ్సిడీ రుణాల కోసం రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, బీసీ బంధు పథకం ప్రవేశపెట్టాలని కోరారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు కేటాయించాలని, 12 బీసీ కులాల ఫెడరేషన్లకు జనాభా నిష్పత్తిలో రూ.2వేల కోట్లు కేటాయించాలని విన్నవించారు. బీసీ విద్యార్థులకు మొత్తం ఫీజుల స్కీమును పునరుద్ధరించాలని కోరారు. మెస్ చార్జీలు, స్కాలర్ షిప్స్‌ను పెంచాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌కు రూ.200 కోట్లు కేటాయించాలని కోరారు.

విమానాల్లో నాణ్యమైన భోజనం ఇవ్వాలి

- క్యాటరింగ్ సంస్థలకు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: విమాన ప్రయాణికులకు అందజేసే ఇన్‌ఫ్లైట్ భోజనం విషయంలో కచ్చితమైన నాణ్యతాప్రమాణాలను పాటించాలని ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) సంబంధిత సంస్థలను ఆదేశించింది. విమానాల్లో ప్రయాణికులకు ఆహార పదార్థాలను అందజేసే క్యాటరింగ్ సంస్థలు, ఎయిర్‌లైన్స్ సంస్థలతో ఈ నెల 16వ తేదీన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆహార పదార్థాల నాణ్యత, నిబంధనల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రయాణికులకు ఇచ్చే ఆహారం ఎంతో సురక్షితంగా, నాణ్యమైనదిగా ఉండాలని ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ సూచించింది. ఆహార భద్రత, ప్రమాణాల మేరకు లేబులింగ్, డిస్‌ప్లే స్పష్టంగా ఉండాలని, ఈ మేరకు 2020లో విధించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్ని విమాన క్యాటరర్లు, విమానయాన సంస్థలను ఆదేశించింది. ప్రయాణ సమయంలో అందజేసే ఆహార పదార్థాల పూర్తి వివరాలు ప్రయాణికులకు ఇవ్వాలని ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆదేశించారు. దీంతో క్యాటరింగ్ సేవల్లో పారదర్శకత పెరుగుతుందన్నారు. మరోవైపు ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ మండలం గగ్గలపల్లిలో చోటుచేసుకుంది. పట్టణ రెండవ ఎస్‌ఐ రాంచందర్‌జీ వివరాల మేరకు.. గగ్గలపల్లికి చెందిన ఎస్‌కే గులాం (44) ఆటో నడుపుకొని జీవనం సాగించేవాడు. ఇటీవల తన కూతురి వివాహం చేయడంతో అప్పులు ఎక్కువయ్యాయి. ఓవైపు ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు అప్పులబాధను భరించలేక శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

చారకొండ: రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన ఘటన చారకొండ మండలం కమాల్‌పూర్‌తండా వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవి వివరాల మేరకు.. మండలంలోని గోకారం గ్రామానికి చెందిన డ్రైవర్ జావేద్ కారులో చంద్రాయన్‌పల్లికి చెందిన భార్యాభర్తలు బాల్‌రాజు, శిల్పతో పాటు అత్త రాములమ్మ నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి బయల్దేరారు. కమాల్‌పూర్ తండా వద్ద ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం కారును ఢీకొట్టింది. ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు.. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రికి తరలించా రు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కారు డ్రైవర్ జావేద్ తండ్రి రషీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

ఆర్టీసీకి కలిసొచ్చిన సంక్రాంతి



సంక్రాంతి పండగ రోజుల్లో మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ (ఫైల్)

- ప్రయాణికుల రద్దీతో రీజియన్‌కు మెరుగైన ఆదాయం
- ఈ నెల 7 నుంచి 18 వరకు రూ.21 కోట్లకుపైగా రాబడి
- మహాలక్ష్మి పథకంతో అమాంతం పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో

స్టేషన్ మహబూబ్‌నగర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ సంస్థ ప్రత్యేక అదనపు బస్సు సర్వీసులను నడిపింది. పండుగ సందర్భంగా మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలో ప్రయాణికుల కోసం 420 అదనపు సర్వీసులు నడిపారు. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాలోని తమ సొంత స్థలాలకు ప్రయాణికులు వెళ్లడానికి అధికంగా బస్సులు నడిపారు. వీటిలో సెలవులు ముగిసిన అనంతరం తిరుగు ప్రయాణంలోనూ ప్రయాణీకుల రద్దీ నెలకొంది. మహాలక్ష్మి పథకం కింద ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో బస్సుల్లో గతేడాదితో పోల్చితే ఈసారి ఆక్యుపెన్సీ రేషియా అమాంతం పెరిగింది.

గతేడాది కంటే అధికంగా..

మహాలక్ష్మి పథకం కింద ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంలో జీరో టికెట్ ఉన్నప్పటికీ అందులో వారు తిరిగిన రూట్ ఆధారంగా టికెట్ చార్జీ కూడా పొందుపరిచారు. మహిళల ఆదాయాన్ని కలుపుకొని సంక్రాంతి పండుగ రోజులకు సంబంధించి ఈ నెల 7 నుంచి 18 వరకు రీజియన్ పరిధిలో ప్రత్యేక అదనపు సర్వీసులు నడపగా రూ.21.53 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది ఇదే జనవరి 7 నుంచి 18 వరకు ఆర్టీసీ రీజియన్‌కు రూ.15.53 కోట్ల ఆదాయం రాగా ఈసారి.. రూ.5.94 కోట్ల ఆదాయం అధికంగా రావడం విశేషం. రీజియన్‌లోని ఆర్టీసీ బస్సులు. ప్రైవేట్ హైర్ బస్సులు గతేడాది 37.40 లక్షల కి.మీ., నడవగా, ఈసారి 37.61 లక్షల కిలోమీటర్లు తిరిగాయి. అదేవిధంగా బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియా గతేడాది సంక్రాంతి పండుగ రోజుల్లో 71 శాతం ఉండగా.. ఈ సారి 96 శాతానికి పెరిగింది. డిపోల వారీగా ఈ నెల 7 నుంచి 18 వరకు మహబూబ్‌నగర్ డిపో రూ.3.26 కోట్లు, వనపర్తి రూ. 2.84 కోట్లు, గద్వాల రూ.2.52 కోట్లు, కల్వకుర్తి రూ.2.43 కోట్లు, నారాయణపేట డిపో రూ.2.21 కోట్లు, అచ్చంపేట రూ.2.20కోట్ల ఆదాయం వచ్చింది.

ఏర్పాట్లను పరిశీలించిన ఆర్‌ఎం

అచ్చంపేట నియోజకవర్గంలో జరుగుతున్న ఉమామహేశ్వరం జాతర, రంగాపూర్ నిరంజన్ షావలీ దర్గా ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం రీజినల్ మేనేజర్ శ్రీదేవి పరిశీలించారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన అదనపు బస్సు స్టాళ్లను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు, సలహాలు అందజేశారు.



ఉమామహేశ్వరంలో అదనపు బస్సులను పరిశీలిస్తున్న ఆర్‌ఎం శ్రీదేవి తదితరులు

మెరుగైన సేవలు అందిస్తాం..

ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తుంది. మహాలక్ష్మి పథకం ప్రారంభమైన తర్వాత ప్రయాణికుల సంఖ్య పెరిగింది. సంక్రాంతి పండుగ రోజుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు సర్వీసులు నడిపించాం. తిరుగు ప్రయాణంలోనూ ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. ప్రజలను వారి గమ్యస్థానాలకు చేర్చడంలో తోడ్పడిన డ్రైవర్లు, కండక్టర్లతోపాటు సిబ్బందికి అభినందనలు.

– శ్రీదేవి, ఆర్‌ఎం, మహబూబ్‌నగర్

ఎర్రపెంటలో ఎన్‌జీఓ బృందం అధ్యయనం



ఎర్రపెంటలో చెంచులతో కర్ణాటక ఎన్‌జీఓ బృందం సభ్యులు

- అటవీ హక్కుల చట్టంపై చెంచులతో చర్చ

లింగాల: నల్లమల అటవీ ప్రాంతంలోని ఎర్రపెంటను శుక్రవారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎన్‌జీఓ బృందం సభ్యులు సందర్శించి చెంచుల స్థితిగతులను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు పలు విషయాలపై చెంచులతో చర్చించారు. ముఖ్యంగా అటవీ హక్కుల చట్టం 2006ను ఏవిధంగా సద్వినియోగం చేసుకుంటున్నారనే విషయాలను తెలుసుకున్నారు. నల్లమల ప్రాంతలో ఉన్న అటవీ సంపదను జీవనోపాధికి వాడుకుంటున్నామని, ముఖ్యంగా తేనె, చింతగింజలు, పండ్లు, ఉసిరి, జిగురు తదితర వాటిని సేకరిస్తున్నట్లు చెంచులు బృందం సభ్యులకు వివరించారు. పలు కమిటీల ద్వారా హక్కులను సాధించుకుంటున్నట్లు చెంచులు చెప్పారు. ఐటీడీఏ, ఆర్డీటీ ద్వారా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, పెంటకు రోడ్డు సౌకర్యం ఏర్పడిందన్నారు. ఈ ప్రాంతంలోని చెంచు పెంటలలో అమలవుతున్న అటవీ హక్కు చట్టాన్ని తమ రాష్ట్రంలో కూడా అమలు చేసేందుకు అవగాహన కోసం ఇక్కడికి వచ్చామని బృందం సభ్యులు జీఎం సింహం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అక్కమ్మ, బృందం సభ్యులు రత్నమ్మ, రజోబి, అప్పయ్య, ప్రకాష్, సురేష్, ఎస్వీకే డైరెక్టర్ లక్ష్మణ్‌రావు, ఎఫ్‌ఆర్‌సీ కమిటీ చైర్మన్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం

మన్ననూర్: అమ్రాబాద్ డివిజన్‌లోని టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో 2019–22లో కంప నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై శుక్రవారం అమోరా ఏజెన్సీ ఢిల్లీ బృందం విచారణ చేపట్టింది. మన్ననూర్ అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలోని వనమాళికా ప్రాంగణంలో అటవీ అధికారులు, సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా అడవులు, పెద్ద పులులు, వన్యప్రాణుల సంరక్షణకు చేపడుతున్న చర్యలతో పాటు అమ్రాబాద్ డివిజన్‌లో నిర్మించిన చెక్‌డ్యాంలు, ఫైర్ లైన్స్, అంతర్గత రోడ్లు, బేస్ క్యాంపు నిర్మాణాలు తదితర వాటి వివరాలు తెలుసుకున్నారు. ఎన్‌టీసీపీఏ నుంచి అందించాల్సిన సహకారంపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు వారు తెలిపారు. డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి, ఎఫ్‌డీఓ విశాల్, ఎఫ్‌ఆర్‌ఓలు గురుప్రసాద్, ఆదిత్య తదితరులు ఉన్నారు.

విద్యుత్ బకాయిలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యుత్ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి వినియోగదారుల సమస్యలు తెలుసుకోవాలని ఆ శాఖ డైరెక్టర్ ఆపరేషన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శాఖ పనితీరుపై శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని విద్యుత్ భవన్‌లో ఉమ్మడి జిల్లా యంత్రాంగంతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుస్తాయన్నారు. వినియోగదారులను ఇబ్బందులకు గురిచేయకుండా గడువులోగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించారు. ప్రతినెలా 9లోగా బిల్లింగ్ చేయాలని అప్పుడే కరెక్ట్ బిల్లులు వస్తాయన్నారు. వినియోగదారులకు తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరించి నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించమని, ప్రతినెలా విద్యుత్ బిల్లుల వసూలుపై దృష్టిసారించాలని, పెండింగ్ బిల్లులపై ప్రత్యేక దృష్టి పెట్టి వసూలు చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వచ్చే ఎండాకాలంలో ఓవర్ లోడింగ్‌లను గుర్తించి సరిపడా విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ట్రాన్స్‌కో డైరెక్టర్లు శ్రీనివాసరావు, మదన్‌మోహన్, గంప గోపాల్, రాములు, సీజీఎం భిక్షపతి, మహబూబ్‌నగర్ ఎస్‌ఈ శ్రీరాంమూర్తి, డీఈ చంద్రమౌళి, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎస్‌ఈలు, ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

వైద్య విధాన పరిషత్‌ను రద్దుచేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సత్యనారాయణరెడ్డి తదితరులు

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ వైద్య విధాన పరిషత్‌ను రద్దుచేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌గా మార్చాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలో యూనియన్ క్యాలెండర్‌ను ఆస్పత్రి ఆర్‌ఎంఓ హరినాథ్ ద్వారా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న వైద్య ఉద్యోగులందరికీ ట్రెజరీ ద్వారా 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలన్నారు. వైద్యరంగంలో సిబ్బంది అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్ సెక్యూరిటీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, వర్క్ కాంట్రాక్టర్ విధానానికి స్వస్తిపలికి కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. జడ్చర్ల ఆస్పత్రిలో స్థాయికి తగినట్లుగా వైద్యులు, సిబ్బందిని వెంటనే నియమించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సురేష్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మైకేల్ మనోహర్, గౌరవాధ్యక్షుడు అరుణ్, కోశాధికారి భాస్కర్, జడ్చర్ల బ్రాంచ్ కార్యదర్శి శ్రీనివాస్‌కుమార్, కోశాధికారి అనిత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుల మార్పులో కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌సాగర్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): భారతీయ జనతా పార్టీ ప్రకటించిన జిల్లా అధ్యక్ష పదవులు బీసీలకు రాకుండా.. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికి ఇప్పించడంలో డీకే అరుణ కుట్రపూరితంగా వ్యవహరించడంలో ఆంతర్యమేమిటని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌సాగర్ ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ ముఖ్యమంత్రి అంటూ శాసనసభ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన బీజేపీ.. బీసీలపై ఎందుకు వివక్ష చూపుతుందన్నారు. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వీరబ్రహ్మం స్థానంలో శ్రీనివాస్‌రెడ్డిని, నారాయణపేట జిల్లా అధ్యక్షుడిగా ఉన్న శ్రీనివాస్ స్థానంలో జలంధర్‌రెడ్డిని నియమించి, బీసీలకు అన్యాయం చేశారని విమర్శించారు. కొన్నేళ్లుగా మహబూబ్‌నగర్ బీజేపీలో సీనియర్లుగా ఉన్న బీసీలకు పదవులు ఇస్తే తమ మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్న ఉద్దేశంతోనే ఈ కుట్రకు పాల్పడినట్లు అర్థమవుతుందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థిగా శాంతికుమార్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కోకన్వీనర్ సత్యంసాగర్, ఆశన్న, ఆర్.సత్యం ఉన్నారు.